క్లుప్తంగా

వైభవంగా గోపయ్య కల్యాణం



వేటపాలెం: రామన్నపేట చీరాల–ఒంగోలు రోడ్డు పక్కన గల లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో అమ్మవారి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి పుట్టింటి వారైన బులసల వారు ఆచార సంప్రదాయ ప్రకారం పట్టు వస్త్రలు పసుపు, కుంకుమలు అమ్మవారికి, స్వామి వారికి బహూకరించారు. గుంటూరు విష్ణుకుమార్, శివపార్వతి దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి కల్యాణ మహోత్సవం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కళ్యాణ మహోత్సం తిలకించారు. కార్యక్రమంలో బులసల రామలింగం, లక్ష్మీప్రసాదరావు, బండ్ల బాబు, జెడ్పీటీసీ బండ్ల తిరుమలాదేవి పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండపానికి ఏసీ వితరణ



అద్దంకి: మండలంలోని శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన సమీపంలోని టీటీడీ కళ్యాణ మండప గది ఆధునీకీకరణకు దాతలు చేయూతనిస్తున్నారు. దానిలో భాగంగా శనివారం ప్రకాశం జిల్లా ముండ్లమూరుకు చెందిన మేదరమెట్ల శేషగిరిరావు, దేవకీదేవి కుమారుడు రామకృష్ణ, సౌజన్య దంపతులు గదికి అవసరమైన ఏసీ, గీజల్, మంచం బెడ్‌ను ఏసీ తిమ్మనాయుడికి అందజేశారు. అదే విధంగా బల్లికురవ మండలం కొప్పరపాడు గ్రామానికి చెందిన కామినేని వెంకట్రావు, సుచరిత దంపతులు ముఖమండప నిర్మాణానికి రూ.1 లక్ష అందజేశారు. వారికి ఏసీ మెమెంటో ఇచ్చి అభినందించారు.

నేడు వెన్నుపోటు దిన సమావేశం

బల్లికురవ: కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో చేసిన అరాచకాలు, మోసాలు, అన్యాయాలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగే వెన్నుపోటు దినోత్సవానికి తరలి రావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి మండలంలోని మల్లాయపాలెం, కొణిదెన, వేమవరం గ్రామంలో కార్యకర్తలతో మాట్లాడారు. ఆదివారం ఉదయం వెన్నుపోటు దినోత్సవ సమాయత్తానికి సంబంధించి అద్దంకిలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి మేరుగు నాగార్జున ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఇందుకు సంబంధించి వాల్ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరిస్తారని గ్రామాల వారీగా వైఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు.

నేటి నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1 తేదీ ఆదివారం నుంచి రేషన్ దుకాణాల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ కే గోపికృష్ణ సూచించారు. శనివారం చీరాల పట్టణం, రూరల్ గ్రామాల్లో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రేషన్ సరుకులను జూన్ 1 నుంచి ప్రతీ డీలర్ విధిగా రేషన్ దుకాణాల ద్వారానే ప్రజలకు అందించాలన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు షాపు తెరచి సరుకులు పంపిణీ చేయాలన్నారు. తూకంలో వ్యత్యాసాలు లేకుండా సరుకులు అందించాలని, ప్రతి షాపులో స్టాక్ రిజిస్టర్, బోర్డులో నిల్వలు ఉంచాలని, ప్రభుత్వ ధరలకు అదనంగా అమ్మకాలు చేయకూడదన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడినా, సరుకులకు బ్లాక్ మార్కెట్ తరలించినా చర్యలు తప్పవని తహసీల్దార్ డీలర్లకు హెచ్చరించారు. సమావేశంలో చీరాలలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

దాతల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు



బల్లికురవ: గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి నిఘా రక్షణకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 6 గ్రామాల్లో సీసీ కెమెరాలు మానిటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఎస్సై వై నాగరాజు ఆధ్వర్యంలో బల్లికురవ, వేమవరం జంక్షన్, గ్రామం, పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం, చెన్నుపల్లి, గ్రామాల్లో గ్రామస్తులు, దాతల సహకారంతో గ్రామానికి నలువైపుల కెమెరాలు ఏర్పాటు చేయించారు. శనివారం సాయంత్రం బల్లికురవలో దాతల హకారంతో ఏర్పాటు చేయించిన కెమోనాలను ఎస్సై పర్యవేక్షించారు. మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని మండలంలోని కొప్పరపాడు, వైదన, ఎస్ఎల్ గుడిపాడు, సుజాతా నగర్ కాలనీ, రామాంజనేయపురం గ్రామాల్లో వచ్చే వారంలో సీసీ కెమోరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్సై వివరించారు.



కొప్పరపాడులో ముందుబాబులకు అడ్డాగా చెత్త నుంచి సంపద కేంద్రం



వల్లాపల్లి ఎస్సీ కాలనీ మురుగు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

ఊరంతా దిబ్బలు..
వీధులన్నీ వ్యర్థాల కుప్పలు !

- మండలంలోని గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- రోడ్ల వెంబడే ఎరువుల దిబ్బలు, వ్యర్థాల కుప్పలు
- ప్రకటనలు, ప్రచారానికే పరిమితమైన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర
- మూలనపడిన గ్రీన్ అంబాసిడర్ల రిక్షాలు

బల్లికురవ: గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. రోడ్ల వెంబడే ఎరువుల దిబ్బలు, వ్యర్థాల కుప్పలు, సైడు కాల్వల్లో ముందుకు కదలని మురుగుతో స్వాగతం పలుకుతున్నాయి. వ్యాధులు సోకుతాయోమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితులకు తోడు నెల రోజులుగా అకాల వర్షాలు కురుస్తుండటంతో గ్రామాలు చిత్తడిగా మారడంతో బురదమయంగా తయారయ్యాయి. బురద, మురుగు ప్రభావానికి దోమలకు ఆవాసం అవుతున్నాయి. గ్రామ పంచాయతీలకు నిధులు మంజురవుతున్నా అవి హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి. ప్రభుత్వం ప్రతి నెల 3 వ శనివారాన్ని స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కింద ప్రకటించటంతో అధికారులు, ఫోటోలు, పబ్లిసిటీతో మమ అనిపిస్తున్నారు.

ఎరువు దిబ్బలు–వ్యర్థాల కుప్పలు..

మండలంలోని వీ కొప్పరపాడు, వెలమవారిపాలెం, బల్లికురవ, ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరం, మల్లాయపాలెం, వల్లాపల్లి, పెద అంబడిపూడి, కొప్పరపాలెం, ఉప్పమాగులూరు గ్రామ పంచాయతీలతో పాటు శివారు గ్రామాలైన సోమవరప్పాడు, కోటావారిపాలెం, సూరేపల్లి, రామాంజనేయపురం, కొత్త మల్లాయపాలెం, చిన అంబడిపూడి, జమ్ములమడక కాలనీలు, కూకట్లపల్లి, యానాది సంగంలో ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాల కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల వర్షాలకు ఈ వ్యర్థాల కుప్పలు కుళ్లి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి.

మూలనపడిన రిక్షాలు..

గ్రామాల వారీగా తడిచెత్త, పొడిచెత్త సేకరణకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా 21 గ్రామ పంచాయతీలకు ఒక్కో పంచాయతీకి ఇద్దరు చొప్పున గ్రీన్ అంబాసిడర్లు, రిక్షాలు ఏర్పాటు చేసింది. గత సంవత్సర కాలం నుంచి 50 శాతం రిక్షాలు మూలన పడ్డాయి. అంబాసిడర్లకు జీతాలు చెల్లించనందున వారు పనులకు హాజరు కావడం లేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల శుభ్రతపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



కొప్పరపాడులో నామ్ రహదారి వెంబడి వ్యర్థాల కుప్పలు



సైడుకాల్వలు లేక రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

ముందుకు సాగని సైడు కాల్వలు..



పాతమల్లాయపాలెం, ఎస్సీ కాలనీల్లో సైడు కాల్వలు, నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా సైడు కాల్వలు లేనందున రోడ్డుపై గుండానే మురుగు ప్రవహిస్తోంది. సైడు కాల్వల నిర్మాణానికి ఎర్త్ వర్క్ పనులు చేపట్టి 20 రోజులవుతున్నా పనులు ముందుకు సాగడం లేదు.

– బిరుదు కోటయ్య, పాతమల్లాయపాలెం

ఎక్కడిపడితే అక్కడే వ్యర్థాలు..



గ్రీన్ అంబాసిడర్లకు సంబంధించిన రిక్షాలు మూలన పడినందున వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడే పడేస్తున్నారు. ఇటీవల వర్షాలకు వ్యర్థాల కుప్పలు దుర్వాసనతో రోగాలు సోకుతాయోమని భయపడుతున్నాం. పారిశుద్ధ్య కార్యక్రమాలు మెరుగుపర్చి ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషిచేయాలి.

– పరిటాల పవన్, కొప్పరపాడు

ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి



శివప్రసాద్‌ను సత్కరిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది



చినగంజాంలో ఎంపీడీఓ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

యద్దనపూడి: ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష అన్నారు. స్థానిక పీహెచ్‌సీ కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న తంగెళ్ల విజయచంద్ర శివప్రసాద్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తన 35 ఏళ్ల ఉద్యోగ కాలంలో వైద్యశాఖలో హెల్త్ అసిస్టెంట్‌గా ,ఎంపీహెచ్‌ఈఓగా పదోన్నతి పొందుతూ ఆరోగ్యశాఖలో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు సేవలందిచారని కొనియాడారు. ఈ సందర్భంగా శివప్రసాద్, లక్ష్మీకుమారి దంపతులను సిబ్బంది దుశ్శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

వృత్తిపై నిబద్ధత కొందరికే ఉంటుంది..

చినగంజాం: తాము నిర్వహించే వృత్తి పట్ల పూర్తి నిబద్ధత కలిగి సేవ చేయాలనే దృక్పథం కలిగిన వ్యక్తులు కొందరే ఉంటారని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి అద్దంకి శ్రీనివాసమూర్తి ఉద్యోగ విరమణ సత్కార సభ స్థానిక వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఈఓపీఆర్డీ రామకృష్ణ అధ్యక్షత వహించగా పలువురు మండల స్థాయి అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తిని సతీ సమేతంగా పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

చీరాల: ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ 38వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం శనివారం చీరాల ఎల్‌ఐసీ కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు డివిజన్ అధ్యక్షులు పి.సుందరబాబు, జనరల్ సెక్రటరీ డి.ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఎస్.మంజుల హాజరయ్యారు. జిల్లా సెక్రటరీ ఆర్‌వీఎస్ రామిరెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇతర కార్మిక సంఘాలకు అన్నింటిని కలుపుకుంటూ యూనియన్ ఇచ్చే ప్రతి పిలుపును విజయవంతం చేస్తామన్నారు. అనంతరం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ హరిప్రసాద్, కార్యదర్శిగా ఆర్‌వీఎస్ రామిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా వై.పూర్ణచంద్రరావు, కోశాధికారిగా బీవీ సుబ్బారావులు ఎన్నికయ్యారు. సమావేశానికి ఒంగోలు, అద్దంకి బ్రాంచిల నుంచి నాయకులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఈపురుపాలెం హైస్కూల్లో యోగా చేస్తున్న ప్రజలు

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ ప్రతిరోజు యోగా చేయడం వలన మానసిక రుగ్మతలు తొలగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారని చీరాల ఎంపీఈఓ పీ శివసుబ్రమణ్యం సూచించారు. జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని ఈపురుపాలెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, దేవాంగపురి హైస్కూల్లో యోగా విన్యాసాలతో పాటుగా యోగా విశిష్టతల శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే యోగా చేయడం వలన మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలగడంతో పాటుగా ఏకాగ్రత పెరుగుతుందన్నారు. యోగా వలన ఒత్తిడి తగ్గడంతో మానసిక ప్రశాంతత, శారీరక ధృఢత్వం కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులు యోగా విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు, సచివాలయాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువత, గ్రామప్రజలు పాల్గొన్నారు.

మార్టూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్టూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని సచివాలయాల ఉద్యోగులకు యోగా శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం ఐదు రోజులపాటు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. యోగ గురూజీ ఆత్మకూరి సీతారామాంజనేయులు, టీచర్‌లు రాజేష్, మౌనికలు సిబ్బందికి యోగాపై అవగాహన కల్పించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి





జీ కోమల రాణి , ఏ బ్రహ్మానందరెడ్డి, కొమ్మూరి చందు

పర్చూరు(చినగంజాం): వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషిచేస్తామని పార్టీలో నూతన పదవులు పొందిన నాయకులు పేర్కొన్నారు. తమపై నమ్మకాన్ని ఉంచి వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ స్థాయిలో పదవులలో నియమించడంపై వారు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలిగా నియమితులైన జువ్వా కోమల రాణి, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన ఆసోది బ్రహ్మానందరెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమితులైన కొమ్మూరి చందులు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వారితో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదన్‌రెడ్డికి తమ కృతజ్ఞతలు తెలియజేస్తూ వారిచ్చిన పదవులకు గౌరవం పెంచే విధంగా పార్టీ అభివృద్ధికి నియోజక వర్గంలో కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నేడు ఆధ్యాత్మిక ప్రవచనం

చీరాల రూరల్: స్థానిక పాపరాజుతోట స్వర్ణరోడ్డులోని లయన్స్ క్లబ్ సర్వీస్ ట్రస్ట్ బిల్డింగ్‌లో ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు శ్రీమద్భాగవతం అను ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక పీఠం చీరాల అధ్యక్షుడు వీ వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరుకు చెందిన తుకారాం ఉపన్యాసకుడిగా వ్యవహరించనున్నారని చెప్పారు. కార్యక్రమానికి ముందుగా బాల బతుకమ్మ అష్టలక్ష్మి సమాజం వారిచే సంకీర్తన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవుని కృపలు అందుకోవాలని ఆయన కోరారు.

స్టేట్ ర్యాంక్ విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తున్న రోటరీలు

పర్చూరు (చినగంజాం): పదో తరగతి పబ్లిక్ పరీక్షలో స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక శాతవాహన హైస్కూల్‌లో విద్యనభ్యసించి 596 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానం , రాష్ట్ర ర్యాంక్‌లో 5 వస్థానం సాధించిన ఉప్పుటూరు గ్రామానికి చెందిన ఎస్ హర్షితకి ఇంటర్మీడియట్ విద్యనభ్యసించే నిమిత్తం రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో రూ.40 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పర్చూరు ఈఓపీఆర్డీ కే సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ప్రసన్న చేతుల మీదుగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు పాబోలు వెంకటేశ్వర్లు, పంబి సదానందరెడ్డి, కాసా అశోక్ కుమార్, కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకిరూరల్: మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. శనివారం అద్దంకి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎల్ ఎస్తేరమ్మ ఆధ్వర్యంలో కౌన్సిల్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అభివృద్ధి పనులకు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆర్ఐ అర్జున్‌రావు 58 అంశాల అజెండాను చదివి సభ్యులకు వినిపించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి సరఫరాకు వచ్చిన టెండర్‌లను ఆమోదించారు. స్థానిక 4 వవార్డులో నీటి సరఫరా సరిగా లేనందున బాగు చేయించేందుకు అంచనాలు తయారు చేయాలని చైర్మన్ తెలిపారు. దోమల నివారణకు చిన్న ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేయడానికి రూ. 16 లక్షల ఆమోదించారు. మున్సిపాలిటీలోని అభివృద్ధి పనులకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం జారీ చేసిన రూ. 3 కోట్ల నిధులతో ఎన్టీఆర్ నగర్‌లోని సీసీ రోడ్లతో పాటు పట్టణాభివృద్ధి చేపడతునున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రవీంద్ర, కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకును తుంచు.. ఆరోగ్యాన్ని పెంచు



పొగాకు అనర్థాలను వివరిస్తున్న వైద్యుడు చంద్రశేఖర్

పర్చూరు(చినగంజాం): పొగాకు వినియోగించడం తగ్గిస్తే ఆరోగ్యం ఎంతో బాగుంటుందని ఉప్పుటూరు హోమియో వైద్యశాల వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం ఉప్పుటూరు పంచాయతీ కార్యాలయంలో హోమియోపతి వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ రావు పొగతాగడం వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగతాగడం వలన మన దేశంలో రోజుకి 3699 మంది, నిమిషానికి సగటున ఇద్దరు చొప్పున మరణిస్తున్నారని, పొగాకు తాగే వారికే కాకుండా పక్కన ఉండే వారికి కూడా చాలా ప్రమాదమని అని తెలియజేశారు. గ్రామంలో హోమియో వైద్యశాల భవన నిర్మాణం కోసం రూ.10 లక్షల జెడ్పీ నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు.

కన్యకాపరమేశ్వరీ ఆలయ నూతన కమిటీ ఏకగ్రీవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరు బొడ్డురాయి సెంటర్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ దేవస్థాన నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కనమర్లపూడి సాంబశివరావు, కనమర్ల పూడి కోటేశ్వరరావు, కోశాధికారిగా మోదడుగు మురళి, వెంకట బాలకృష్ణ, సుమంత్‌లను ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం నూతన కమిటీ సభ్యులచే ఆర్యవైశ్య ప్రముఖుడు ఆత్మకూరు సీతారామాంజనేయులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఇస్కాన్ టెంపుల్ బృందంతో భగవద్గీత పారాయణం చేయించారు. కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య నాయకులు, మండలంలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 17 మంది ఎంపిక



జాబ్ మేళా నిర్వహిస్తున్న అధికారులు

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ఈపూరుపాలెంలోని ఎస్కేబీఎస్ఎం ఐటీఐ కాలేజిలో జాబ్ మేళాను నిర్వహించారు. జాబ్ మేళాకు పది కంపెనీలు హాజరయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ పాల్గొన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళాలు, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌లు విస్తృతంగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో సుమారు 183 మంది నిరుద్యోగు హాజరుకాగా 71 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌కె సత్తార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్, ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ డిపార్టుమెంట్ వైపీ హారిక సొగంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి తరగతులు ప్రారంభం

బల్లికురవ: ఇంటర్మీయేట్ రెండో సంవత్సరం విద్యార్థులకు సోమవారం నంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్‌లు ఇస్తున్నామని పదో తరగతి పాసైన విద్యార్థులు కళాశాలలో చేరాలని ప్రిన్సిపాల్ కోరారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల స్వీయపర్యవేక్షణలో ఒత్తిడి లేని విద్యతోపాటు కంప్యూటర్ విద్యను అందిస్తూ జిల్లా, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలతో గుర్తింపు పొందినట్లు ప్రిన్సిపాల్ వివరించారు. రెండో సంవత్సరం విద్యార్థులంతా సోమవారం నుంచే తరగతులకు విధిగా హాజరుకావాలని కోరారు.